

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు



ప్రచారానికి అనుమతులు తప్పనిసరి

- లేదంటే చర్యలు తప్పవు
- ఎన్నికల విధులకు 15వేల మంది ఉద్యోగులు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఏప్రిల్3: ఎన్నికల ప్రచారాలకు కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ముందస్తు అనుమతులు పొందాలని, లేదంటే చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై జాయింట్ కలెక్టర్ జి.గణేశ్‌కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్ గౌడ్‌లతో కలసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారాలు నిర్వహించుకోవాలంటే సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల వద్ద అనుమతి పొందాలన్నారు. అనుమతులు లేకుండా ప్రచారాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నాయకుల ర్యాలీలు, స్టార్ కాంపెయిన్, రోడ్‌షో లాంటి కార్యక్రమాల కోసం 48 గంటల ముందు అనుమతి తీసుకోవాలన్నారు. డోర్ టు డోర్ ప్రచారానికి కూడా పర్మిషన్ తీసుకోవాలన్నారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించినట్లు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే తప్పకుండా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. జిల్లాలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా మోడల్ కోడ్ ఉల్లంఘన చర్యలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉందన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఎన్నికల నామినేషన్ల వరకు ఫాం-6 అభ్యర్థనలు స్వీకరిస్తామన్నారు. జిల్లాలో 15 వేల మందికి పైగా ఎన్నికల విధులు కేటాయించామన్నారు. జిల్లాలో ఎన్నికలకు సరిపడినన్ని ఈవీఎంలు ఉన్నాయన్నారు. 14, 15 తేదీల్లో ర్యాండమైజేషన్ చేస్తామన్నారు. 13, 14 తేదీల్లో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ అధికారులకు రెండు విడతల్లో శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థుల ప్రచారాలపై 24 గంటలు షాడో అబ్జర్వేషన్ ఉంటుందని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడే అధికారులు, ఉద్యోగులపై సి-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేస్తే విచారించి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతాప్‌రెడ్డి, కానుగ దానం, లక్ష్మణ రావు, పాల్ సుధాకర్, భరత్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా 'స్వీప్' కార్యక్రమాలు

జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేదిశగా ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వీప్ నోడల్ అధికారిగా ఏ.నాగేశ్వరరావు పర్యవేక్షణ చేయనున్నారని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు 'చునావ్ పాఠశాల' కార్యక్రమం చేపడుతున్నామని పేర్కొన్నారు. అన్ని పంచాయతీలు, బూత్ స్థాయిలోని పాఠశాలల్లో యువతను కవర్ చేయడంతో పాటు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించడం చునావ్ పాఠశాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన.. ఐదుగురు ఆర్టీసీ ఉద్యోగుల సస్పెన్షన్

- వైసీపీ భజన చేసిన ఫలితం

కడప, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలు కట్టే పన్నులతో ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు ఇస్తుంటుంది. సర్వీసు నిబంధనల ప్రకారం వారంతా పనిచేయాల్సి ఉంటుంది. అయితే కొందరు అధికారులు బరితెగించారు. వైసీపీకి భజన చేయడమే పనిగా పెట్టుకున్నారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నప్పటికీ వైసీపీ కోసం అడ్డంగా ప్రచారం చేసి దొరికిపోయారు. కొందరిపై కేసులు నమోదు చేయడంతో పాటు ఐదుగురు ఆర్టీసీ ఉద్యోగులను సస్పెండ్ చేయడం ఆర్టీసీలో సంచలనాత్మకంగా మారింది.

గత నెల 31న బద్వేలు డిపోలో ఏపీజీఎఫ్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి వైఎస్సార్ ఎన్ఎంయూ ప్రెసిడెంటుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని మనంతా జగనన్న రుణం తీర్చుకోవాలంటూ ప్రచారం చేసి కరపత్రాలు కూడా పంపిణీ చేశారు. వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు చల్లాచంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబా ఫకృద్దీన్, ప్రొద్దుటూరు డిపో కార్యదర్శి రామచంద్రుడు, బద్వేలు డిపో కార్యదర్శి సుందరయ్య, మైదుకూరు డిపో కార్యదర్శి ఆర్ఎస్‌రెడ్డిలపై సస్పెన్షన్ వేటు వేశారు. వీరంతా బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, కడప గ్యారేజీల్లో సచివాలయ ఉద్యోగుల చైర్మన్ వెంట్రామిరెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రజారవాణ శాఖ మిత్రులు ప్రభుత్వ రుణం తీర్చుకోండి అంటూ ఉద్యోగులు ప్రచారం చేసిన విషయం పత్రికల్లో వచ్చింది. వీరిపై ఎన్నికల నియమావళి ఉల్లంఘన చేసినట్లు విచారణలో తేలింది. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వీరిపై సస్పెన్షన్ వేటు వేశారు.

కేసు నమోదు

బద్వేలు టౌన్, ఏప్రిల్ 3: ఎన్నికల నియామావళిని ఉల్లంఘించారని బద్వేలు మున్సిపల్ కమిషనర్ క్రిష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఏపీజీఎఫ్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి, చల్లా చంద్రయ్య, సుందరయ్యపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. నిందితులు ఎలాంటి అనుమతి లేకుండా గత నెల 31న ఆర్టీసీ డిపో ప్రాంగణంలో వైసీపీకి మద్దతు తెలపాలని ఉద్యోగులను ప్రేరేపించినట్లు మున్సిపల్ కమిషనరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

నవ్విపోదురు గాక

- పింఛన్లు ఇచ్చేందుకు డబ్బులు లేక..
- టీడీపీపై నెపం
- వలంటీర్లు లేకపోవడంతో పింఛన్లు ఇవ్వలేకపోయారట
- వైసీపీ దుష్ప్రచారం
- ఎన్నికల కమిషన్ ఆదేశాలను లెక్కచేయని వైసీపీ ప్రభుత్వం
- వృద్ధులు, దివ్యాంగులకు తప్పని తిప్పలు
- దీనికంతటికీ కారణం వైసీపీ ఎత్తుగడే..



అబద్ధాలను వల్లెవేయడంలో వైసీపీ వారికి మించిన బ్యాచ్ తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా ఉండదంటారు. ఒక్క చాన్స్ అంటూ ప్రతిపక్ష నేత హోదాలో జగన్ పాదయాత్ర చేశారు. దారి పొడవునా అలవికాని హామీలిచ్చారు. వాటన్నింటినీ మడతపెట్టేసి నవరత్నాలు అంటూ చెప్పుకొచ్చారు. ఎన్నికల హామీలో 99 శాతం అమలు చేశామంటూ ఇప్పుడు గొప్పలు చెప్పుకుంటున్నారు. నాకు పేపరు లేదు, టీవీలేదు అని జగన్ జనం సాక్షిగా పచ్చి అబద్ధం చెబుతుంటారు. ఇక లేని అభివృద్ధి కూడా జరిగిందంటూ వైసీపీ నేతలు చెప్పడం చూస్తుంటాం. ఇప్పుడు పింఛన్ల పంపిణీలో కూడా అదే జరుగుతోంది. నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు.. అన్నట్టుగా అబద్ధాలను వల్లెవేస్తున్నారు.

(కడప-ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం వద్ద డబ్బులు లేవు. ఎన్నికల వేళ పింఛన్లు ఆలస్యమైతే ఓట్లు పడతాయో లేదో అని వైసీపీ కొత్త నాటకానికి తెరలేపింది. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ కొందరు వలంటీర్లు వైసీపీ ప్రచారంలో పాల్గొంటున్నారంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఎన్నికల ప్రచారంతో పాటు ఎన్నికల విధుల్లో వలంటీర్లు పాల్గొనరాదని, అలాగే పింఛన్ల పంపిణీ కూడా వారితో వద్దని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. సరిగ్గా దీనినే వైసీపీ తనకు అనుకూలంగా మలచుకుంది. చంద్రబాబు కారణంగానే పింఛన్లు ఇవ్వలేకపోయామని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి పేటీయం బ్యాచ్‌లు, వైసీపీ బ్యాచ్ అంతా విమర్శించడం మొదలుపెట్టారు. అసలు విషయం ఏంటంటే ప్రభుత్వం వద్ద లెక్క లేకనే పింఛన్ల పంపిణీ ఆలస్యమైనట్లు చెబుతున్నారు.

జిల్లాలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు.. ఇలా అన్నిరకాల పింఛనుదారులు 2,68,179 మంది ఉన్నారు. వీరందరికీ రూ.79,31,026 సొమ్ము అందించాల్సి ఉంది. జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలు 639 ఉన్నాయి. ఒక్కో సచివాలయం పరిధిలో 11 మంది సిబ్బంది ఉంటారు. ప్రస్తుతానికి 5,451 ఉంది ఉన్నారు. వలంటీర్లంతా 10,684 మంది ఉన్నారు. సచివాలయ సిబ్బంది పెన్షనర్ల ఇళ్లకు వెళ్లి ఇస్తే రెండురోజుల్లో అయిపోతుంది. కానీ వైసీపీ ప్రభుత్వం అలా చేయడం లేదు.

ప్రభుత్వం వద్ద డబ్బులు లేక

ఎన్నికల షెడ్యూలు విడుదలైనప్పటికీ కొందరు వలంటీర్లు బరితెగించారు. ప్రజల పన్నులతో ప్రభుత్వం గౌరవ వేతనం ఇస్తుందన్న విషయాన్ని వీరు మరిచారు. ఎన్నికల కమిషన్ ఎన్నికల విధుల్లో పాల్గొనకూడదని చెబుతున్నప్పటికీ డోంట్‌కేర్ అంటూ వైసీపీ ప్రచారంలో పాల్గొన్నారు. వలంటీర్ల ఆగడాలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో వారిని ఈ రెండునెలల పాటు పింఛన్లు పంపిణీ చేయకుండా పక్కనబెట్టింది. ప్రతినెలా 1వతేదీ పింఛను పంపిణీ చేయాలంటే 30 లేదా 31వ తేదీ ప్రభుత్వం డబ్బులను ఆయా ఖాతాల్లో జమచేస్తూ వచ్చేది. ఈ సారి డబ్బులు లేకపోవడంతో పింఛను సొమ్ము వేయడం ఆలస్యమవుతుందని ముందుగానే సమాచారం ఉందని అంటున్నారు. ఇదే సమయంలో వలంటీర్లను ఎన్నికల సంఘం పక్కనబెట్టింది. దీన్ని అవకాశంగా చేసుకుని టీడీపీ వల్లనే పింఛను ఇవ్వలేకపోతున్నామని వైసీపీ దుష్ప్రచారానికి తెరలేపింది. అటు వైసీపీ సోషల్ మీడియా ఇటు ఆయన సొంత మీడియా అన్నింటిలోనూ వలంటీర్ల వల్లనే ఆగిపోయిందంటూ దుష్ప్రచారం చేయడం మొదలుపెట్టారు.

సచివాలయ సిబ్బంది ఉన్నారు కదా

వలంటీర్లను పింఛన్ల పంపిణీకి పక్కనబెట్టడంతో రాజకీయ లబ్ధి కోసం వైసీపీ నానా యాగీ చేసింది.



జమ్మలమడుగు సచివాలయం వద్ద వృద్ధుల పడిగాపులు

అయితే బుధవారం మధ్యాహ్నానికి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అయ్యాయి. సాయంత్రం నుంచి పంపిణీ మొదలుపెట్టారు. వలంటీర్లు లేకున్నా కూడా సచివాలయ సిబ్బంది ఉన్నారు. ఒక్కో సచివాలయంలో 11 మంది సిబ్బంది ఉన్నారు. వీళ్లే పింఛన్లను పంపిణీ చేయవచ్చు. అయితే ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవనే విషయాన్ని పక్కనబెట్టి వలంటీర్లు లేకనే పింఛన్లు ఇవ్వలేదంటూ వైసీపీ డ్రామాలు ఆడటంపై విమర్శలు వచ్చాయి.

చంద్రబాబే రూ.200 నుంచి

రూ.2వేలకు పెంచారు

చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్న సమయంలోనే రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2వేలకు పెంచారు. తాను అధికారంలోకి వస్తే రూ.3వేలు చేస్తానని 2019 ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే ఆ ఎన్నికల్లో జగన్ సీఎం అయ్యారు. ఈయన కూడా హామీ ఇచ్చారు. అయితే సీఎం అయిన తరువాత హామీకి మడతపెట్టి ప్రతి యేటా రూ.250 పెంచుకుంటూ వచ్చారు. చంద్రబాబు ఐదేళ్లలో రూ.200 నుంచి రూ.1800 పెంచి రూ.2వేలు చేస్తే జగన్ మాత్రం ఐదేళ్లలో ఏటా రూ.250 చొప్పున రూ.వెయ్యి పెంచి నేనే గొప్ప నేనే గొప్ప అంటూ ఎలివేషన్ ఇచ్చుకోవడం విమర్శలకు తావిస్తోంది.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే రూ.4వేలు ఇస్తాం

వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.4వేలు పింఛను ఇస్తామని చంద్రబాబు ఇప్పటికే హామీ ఇచ్చారు. అది కూడా నేరుగా ఇంటికి వచ్చి ఇస్తామని ప్రకటించారు. అయితే జగన్ అండ్ కో మాత్రం ఇచ్చిన హామీ అమలుచేయడానికి ఐదేళ్ల పట్టింది. ఇప్పుడు పింఛన్ల పంపిణీపై డబ్బులు లేక చేతులెత్తేసి ఆ నెపాన్ని టీడీపీపై నెట్టడం గమనార్హం.

వైసీపీ నిర్వాకంతో..

పండుటాకుల పడిగాపులు

వైసీపీ నిర్వాకంతో పింఛన్ల కోసం పండుటాకులు సచివాలయాల వద్ద బుధవారం పొద్దున నుంచి పడిగాపులు కాయాల్సి వచ్చింది. ప్రభుత్వం పింఛన్ల సొమ్మును మధ్యాహ్నం అకౌంటులో జమచేసింది. వృద్ధులు, దివ్యాంగులకు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు నేరుగా సచివాలయ సిబ్బంది ఇంటి వద్దనే ఇవ్వాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. బాగున్న వారికి మాత్రమే సచివాలయాల వద్ద ఇవ్వాలని చెప్పింది. అయితే టీడీపీ వారివల్ల పింఛన్లు నిలిచిపోయాయని వైసీపీ నేతలు దుష్ప్రచారం చేయడంతో.. తమకు పింఛను వస్తుందో రాదో అనే భయంతో వృద్ధులు దివ్యాంగులు సైతం సచివాలయాల వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం వరకు కూడా డబ్బులు రాకపోవడంతో ఎండకు వీరు అవస్థలు పడ్డారు. అక్కడకు వచ్చిన వారికే ఇచ్చారు తప్ప ఇంటికి వెళ్లి ఇవ్వలేదు. ఎటు తిరిగి రాజకీయ లబ్ధి కోసం టీడీపీపై బురద చల్లేందుకే వైసీపీ ప్రభుత్వం నిర్ణయించుకుందని పలువురు విమర్శిస్తున్నారు.

ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 3: జిల్లాలో అధికార పార్టీ నాయకులు చెప్పే విధంగా కొందరు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం అమరావతిలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాను కలిసి వినతిపత్రం అందించారు. జిల్లాలో పెరుగుతున్న పలు సమస్యలపై వివరించారు. కొంతమంది అధికారులు అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాన్ని అణచివేయాలని చూస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యం కల్పించిన హక్కులను వారు కాలరాస్తున్నారని వారిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు.



రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్‌కుమార్‌మీనాకు వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాసరెడ్డి

నిర్లక్ష్యంతోనే అధిక శాతం ప్రమాదాలు

- లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలి
- జిల్లా విద్యుత్‌శాఖ అధికారి



కడప (నాగరాజుపేట), ఏప్రిల్ 3: నిర్లక్ష్యంతోనే అధిక శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని.. ట్రాన్స్‌ఫార్మర్లను, లైన్లను ముందస్తుగా మరమ్మతులు చేయాలని జిల్లా విద్యుత్‌శాఖ అధికారి సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్.రమణ సూచించారు. కడప డివిజన్ విద్యుత్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని కడప, చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, వల్లూరు, చెన్నూరు మండలాల క్షేత్ర స్థాయి అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషికి ప్రాథమిక అవసరాల్లో విద్యుత్ భాగమైందన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉందని, చిన్నపాటి అంతరాయాలను కూడా ప్రజలు సహించే పరిస్థితుల్లో లేరన్నారు. నీటి పథకాల పనులను అత్యధిక ప్రాధాన్యతతో పూర్తిచేయాలని ఆదేశించారు. లోఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా అవసరమైన కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. పగటి పూట వీధిలైట్లు వెలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ బకాయిల వసూళ్లలో రాజీ వద్దని, బకాయిల వసూలుపై దృష్టి సారించాలని అన్నారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలన్నారు. వాలిపోయిన స్తంభాలు, లూజులైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలన్నారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కడప డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఏఈలు, జేఈలు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.

యాదవ యువకుడి హత్య

- భూకబ్జాదారులే హత్య చేశారు
- నిందితులంతా ఎమ్మెల్యే అనుచరులే
- పోలీస్‌స్టేషన్‌లో బైఠాయించిన కుటుంబ సభ్యులు

పెండ్లిమర్రి, ఏప్రిల్ 3: పెండ్లిమర్రి మండలంలో ఓ యాదవ యువకుడు హత్యకు గురయ్యాడు. భూకబ్జాదారులైన ఎమ్మెల్యే అనుచరులే హత్య చేశారని బాధితులు ఆరోపించారు. ఈమేరకు పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. వీరికి సీపీఐ మద్దతు తెలిపారు. బాధితుల కథనం మేరకు..

పెండ్లిమర్రి మండలంలోని యాదవాపురం గ్రామానికి చెందిన ఆదిమూలం శ్రీనివాసులు అనే వ్యక్తి మంగళవారం రాత్రి కొత్తపల్లె గ్రామ సమీపంలోని పొలాల్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పొలం వద్దకు వెళ్లిన ఇతను చీకటి పడ్డప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ నాగరాజు, ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహానికి గాయాలు ఉండటంతో శ్రీనివాసులును హత్య చేసి ఉంటారని, ఆయన కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కాగా.. బుధవారం సంఘటన స్థలానికి వెళ్లి శ్రీనివాసులు మృతదేహాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులతో కలసి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. శ్రీనివాసులు యాదవ్‌ను హత్య చేసింది ఎమ్మెల్యే అనుచరులు, వైసీపీ నాయకులు అని అన్నారు. వారికి అండగా పోలీసులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సీఎం సొంత జిల్లాలో భూకబ్జాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడులు చేయడం కేసులు పెట్టడం అయినా వినకపోతే అత్యంత కిరాతకంగా చంపేస్తున్నారని ఆరోపించారు. హత్యకు భూవివాదాలు కారణమని ఎటువంటి డాక్యుమెంట్లు లేకపోయినా వైసీపీ నాయకులు, అనుచరులు గతంలో శ్రీనివాసులు తండ్రి పేరుతో ఉన్న భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేశారన్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ, పోలీస్ శాఖ దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ఉపయోగం లేదన్నారు. వాళ్లు పెద్దోళ్లు, ఎమ్మెల్యే అనుచరులు వాళ్లతో పెట్టుకోవద్దు సర్దుకుపోవాలని అధికారులు చెప్పారన్నారు. వైసీపీ నేత భూమిలోకి దారి లేకపోయిన దౌర్జన్యంగా వీరి భూమిలో వెళ్లేవారన్నారు. దీనిని ప్రశ్నించినందుకు గతంలో మచ్చుకత్తులు, గొడ్డళ్లు తీసుకొని వచ్చి చంపుతామని బెదిరించారన్నారు. ఈ విషయాన్ని పెండ్లిమర్రి పోలీసులకు చెప్పగా పెద్దోళ్లతో సర్దుకుపోవాలని, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మనుషులని.. వాళ్లతో పెట్టుకోవద్దని.. మీరు తక్కువ కులం వాళ్లు అని చెప్పి బాధితులను పోలీసులు బెదిరించారన్నారు. హత్యకు మూలకారణమైన భూవివాదం పరిష్కారం చేయని రెవెన్యూ అధికారులను, పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కాగా.. ఆదిమూలం శ్రీనివాసులు హత్యకు సంబంధించి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు కడప రూరల్ సీఐ నాగరాజు తెలిపారు. కేసు విచారణలో ఉందని అసలైన నిందితులను పట్టుకొని బాధితులకు న్యాయం చేస్తామని సీఐ తెలిపారు.



పెండ్లిమర్రి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మృతుని బంధువులు

ఆదిమూలం శ్రీనివాసులును హత్య చేయించింది జగన్ మేనమామే

- నిందితులను అరెస్టు చేయండి
- ఈసీ, సీఎస్, డీజీపీలకు సీపీఐ ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాదవపురం గ్రామానికి చెందిన ఆదిమూలం శ్రీనివాసులును హత్య చేయించింది సీఎం జగన్మోహన్‌రెడ్డి మేనమామ, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ అనుచరులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు ఆరోపించారు. శ్రీనివాసులు యాదవ్‌ను కిరాతకంగా హత్య చేసిన వారికి పోలీసులు అండగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సీఎం జగన్ సొంత జిల్లా, నియోజకవర్గంలో భూకబ్జాలు విపరీతంగా పెరిగిపోయాయని, శ్రీనివాసులు యాదవ్ హత్యకు భూవివాదాలే కారణమని తెలిపారు. ఇదే ఘటనపై సీపీఐ మరో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య కూడా స్పందించారు. ఆదిమూలం శ్రీనివాసులును హత్య చేసిన భూకబ్జాదారులను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ భూ సమస్యను పరిష్కరించకుండా అలసత్వం ప్రదర్శించి శ్రీని వాసులు కుటుంబ సభ్యులను బెదిరింపులకు గురి చేసిన రెవెన్యూ, పోలీసు అధికారులపై తక్షణ చర్యలు చేపట్టి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఆయన బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, రాష్ట్ర డీజీపీకి లేఖలు రాశారు.



సంఘటన స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

నేడు నారా భువనేశ్వరి రాక



ప్రొద్దుటూరు టౌన్/కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 3: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి గురువారం జిల్లాకు రానున్నారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు సమయంలో మనస్తాపంతో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు గుండెపోటుతో మృతిచెందిన సంగతి తెలిసిందే. వీరిని 'నిజం గెలవాలి' పేరిట నారా భువనేశ్వరి పరామర్శిస్తున్నారు. ఇప్పటికే తొలివిడత బద్వేలు నియోజకవర్గంలో పర్యటించి ఐదు కుటుంబాలను పరామర్శించారు. గురువారం కడప నగరంలోని చెమ్మామియాపేటలో, ప్రొద్దుటూరులోని పెద్దశెట్టిపల్లెలో పర్యటించి రెండు కుటుంబాలను పరామర్శించనున్నారు.

ఇక్కడ కోడ్ వర్తించదా



బద్వేలులోని కొండపల్లె కాంప్లెక్స్‌లో జగన్ అనే నేను సిద్ధం పేరిట ఓ ఫ్లెక్సీ

కడప, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. మార్చి 16న మధ్యాహ్నం 3గంటల నుంచి కోడ్ అమలులో ఉంది. రాజకీయ నాయకుల ఫొటోలు ఫ్లెక్సీలు తొలగించారు. విగ్రహాలకు ముసుగు వేశారు. అయితే బద్వేలులోని నాలుగురోడ్ల సర్కిల్‌లోని కొండపల్లె కాంప్లెక్స్‌లో 'జగన్ అనే నేను సిద్ధం' పేరిట ఓ ఫ్లెక్సీ అలాగే ఉంది. వైసీపీ ఫ్యాను గుర్తులు ఉన్నాయి. నాలుగురోడ్ల సెంటరులో ఈ బోర్డు చూసి దీనికి కోడ్ వర్తించదా అంటూ జనం ప్రశ్నిస్తున్నారు.

స్త్రీశక్తిసేవా సమితి టీం ఆధ్వర్యంలో వితరణ



క్రాంతి కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందిస్తున్న స్త్రీశక్తి సేవా సమితి

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 3: ఏఎస్ఆర్ నగర్‌లో ఉంటున్న క్రాంతి అనే ట్రాక్టరు డ్రైవరు మూడునెలల క్రితం ప్రమాదవశాత్తు కాళ్లు కోల్పోయాడు. అతడి కుటుంబం రోడ్డుపాలైంది. ఈ విషయం తెలుసుకున్న స్త్రీశక్తి సేవా సమితి టీం ఆ కుటుంబానికి అండగా నిలిచి మూడు నెలలకు సరిపడా మూడు బస్తాల బియ్యం, నిత్యావసర వస్తువులు, రూ.5వేలు పంపిణీ చేశారు. ఈ కుటుంబానికి అండగా నిలిచిన ప్రతి దాతకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధాశ్రమంలో అల్పాహారం వితరణ

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 3: కడప నగరం ప్రేమాలయ నిరాశ్రయుల వసతిగృహంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం అల్పాహార వితరణ నిర్వహించారు. నగరానికి చెందిన నారాయణరాజు తమ తల్లి గంగమ్మ జ్ఞాప కార్థం ఆశ్రమంలో అనాథ వృద్ధులందరికీ అల్పాహారం అందించారు. ఆశ్రమం నిర్వాహకులు శ్రీనివాసులరెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి కొండూరు జనార్ధన్ రాజు, డైరెక్టరు వెంకటరమణారెడ్డి, మల్లిఖార్జున, విజయశేఖర్ పాల్గొన్నారు.

ఒంటిపూట బడుల పనివేళలు కుదించాలి

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 3: రాష్ట్రంలో ఎండలు తీవ్రమవుతున్నందున ఒంటిపూట బడుల నిర్వహణ పనివేళలు కుదించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు ప్రసాద్, చెంగల్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్‌సెక్రటరీలు ఈశ్వర్‌చంద్ర, ఆలీఖాన్ సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ 37 నుంచి 43 డిగ్రీల వరకు ఎండ తీవ్రత నమోదైనట్లు ప్రకటించిన దృష్ట్యా ఉదయం 7.30 నుంచి 11.30 వరకు పనివేళలను కుదిం చాలని కోరారు.

సమయం తగ్గించండి

రాష్ట్రంలో ఎండ తీవ్రత ఎక్కువైనందున తరగతి గదుల్లోనూ పాఠశాల వదిలిన తరువాత పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని.. ఒంటిపూట బడుల సమయం తగ్గించాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి డిమాండ్ చేశారు. వాతావరణ శాఖ కూడా ఎండలు ఎక్కువగా ఉన్నాయి, మిట్ట మధ్యాహ్నం తిరగవద్దని హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేసి పిల్లల ఆరోగ్యం దృష్ట్యా సమయాన్ని కుదించాలని కోరారు.

ఫోర్జరీ డి.ఫారాలపై విచారణ జరపాలి

చెన్నూరు, ఏప్రిల్ 3: రుద్రభారతిపేటలో ఫోర్జరీ డిఫారాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసు కోవాలని చెన్నూరు మాజీ సర్పంచ్ పొట్టిపాటి ప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం చెన్నూరులో ఆయన విలే కరులతో మాట్లాడుతూ 2002లో పేదలకు రుద్రభారతి పేటలో ఇంటిస్థలాలు ఇచ్చారన్నారు. అయితే ఆ స్థలాల్లో ఇప్పటికీ కొందరు ఆక్రమించుకుని ఫోర్జరీ డిఫారాల చేసి అమ్ముకుని లక్షలు ఆర్జిస్తున్నారన్నారు. అధికారులు అవకతవకలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుని, నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

మెజారిటీ సాధించడమే లక్ష్యంగా పనిచేయండి

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి



సమావేశంలో మాట్లాడుతున్న పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి

పులివెందుల టౌన్, ఏప్రిల్ 3: తొండూరు మండలంలో మెజారిటీ సాధించడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో తొండూరు మండల నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చేది మన ప్రభుత్వమే అని.. ప్రతి నాయకుడు, కార్యకర్త ధైర్యంగా పోరాడాలన్నారు. సర్వేలలో కూడా తొండూరు మండలంలో టీడీపీకే మెజారిటీ వస్తుందని వచ్చిందన్నారు. జగన్‌పై వ్యతిరేకత సాధారణ మహిళ వరకు కూడా చేరిందన్నారు. ఈ వ్యతిరేకతను అవకాశంగా తీసుకొని మనపార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. వైసీపీ నాయకులు అధికారం ఉపయోగించి డికేటీ భూములను లాక్కున్నారని, టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే పేదలకు ఇప్పిస్తామన్నారు.

జగన్ ప్రభుత్వంలో రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. లోపభూయిష్టమైన ఇన్సూరెన్స్ విధానంతో రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరికి ఏడాదికి రైతుకు పెట్టుబడిగా రూ.20వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. పాత ఇన్సూరెన్స్ విధానాన్ని కొనసాగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థ సారధిరెడ్డి, మాజీ జడ్పీటీసీ శివమోహన్‌రెడ్డి, రఘునాథరెడ్డి, జయభరత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలకు అన్ని విధాల అండగా టీడీపీ : పుత్తా చైతన్యరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణచైతన్యరెడ్డి

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 3: తెలుగుదేశం పార్టీ బీసీలకు అన్ని విధాల అండగా ఉంటుందని కమలాపురం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చైతన్యరెడ్డి మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలు పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారని.. పార్టీ కూడా వారికి ఎల్లవేళలా అండగా నిలిచిందన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. 50 ఏళ్లు ఉన్న బీసీ కులస్థుల అందరికీ పింఛన్ సౌకర్యం కల్పించడమే టీడీపీ ధ్యేయమన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆదరణ పథకం కింద పరికరాలను అందజేశామని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుర్రప్పయాదవ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం: బీసీలకు ఎల్లవేళలా టీడీపీ అండగా ఉంటుందని తెలుగు యువత మాజీ జిల్లా అధ్యక్షుడు దివాకర్‌రెడ్డి తెలి పారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జయహో బీసీ కార్య క్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ అంటే టీడీపీ అని.. టీడీపీ అంటే బీసీల పార్టీ అని, ప్రజలకు నమ్మకం ఉంద న్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం వచ్చాక బీసీలంటే వెనకబడినవారిగా నిర్ధారించుకుని రాష్ట్ర వ్యాప్తంగా హత్యలు చేయించడం సర్వసాధారణ మైందన్నారు. కమలాపురం టీడీపీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్ బాషా, క్లస్టర్ ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి, బీసీ నాయకులు కొప్పోలి శంకర్‌యాదవ్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు : బీసీల అభ్యున్నతే టీడీపీ ధ్యేయమని మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం మండలంలోని బీసీ నేతలు, కార్యకర్తలతో జయహోబీసీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండల కన్వీనరు మాట్లా డుతూ టీడీపీ పాలనలో 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్ వైసీపీ పాలనలో 10 శాతం తగ్గించి 24 శాతంకు అమలు చేశారన్నారు. టీడీపీ జిల్లా అధి కార ప్రతినిధి మన్నూరు అక్బర్, నేతలు వేల్పుల సుబ్రమణ్యం, ఆటోబాబు, కుందేటి క్రిష్ణయ్య పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్ అరెస్టు

కడప (క్రైం), ఏప్రిల్ 3: కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలో వాకింగ్ చేస్తున్న మహిళా మెడలో బంగారు గొలుసు చోరీ చేసిన కేసులో ఒక చైన్ స్నాచర్‌ను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ రంగస్వామి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. హౌసింగ్‌బోర్డు కాలనీలో మార్చి 3న సాయంత్రం నలమారు జయప్రదమ్మ అనే మహిళ వాకింగ్ చేస్తుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మోటరు సైకిలుపై వచ్చి ఆమె మెడలో నుంచి సుమారు రూ.2.50 లక్షలు విలువ చేసే 28 గ్రాముల బంగారు తాళిబొట్టు సరుడు లాక్కుని పరారీ అయ్యారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం వైవీ స్ట్రీట్‌లో బంగారు కొదువ పెట్టే షాపుల వద్ద అనుమా నాస్పదంగా నిందితుడు తిరుగుతున్నట్లు సమా చారం రావడంతో దాడి చేసి పట్టుకున్నామన్నారు. నిందితుడు కడపకు చెందిన షేక్ అక్బర్ ఆలీ అని, ఎలక్ట్రిషియన్ పనులు చేసుకుంటూ సుల భంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో ఈ ఘటనకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. ఆ మేరకు అతన్ని అరెస్టు చేసినట్లు తెలిపారు.

సుందరేషన్ డిప్యుటేషన్ రద్దు చేసి సస్పెండ్ చేయాలి



డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

కడప (నాగరాజుపేట), ఏప్రిల్ 3: అనంతపురం రూరల్ రిజిస్ట్రార్ సుందరేషన్ డిప్యుటేషన్ రద్దు చేసి సస్పెండ్ చేయాలని... జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబుపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని.. లేకపోతే దీక్షలు చేపడతామని రాయలసీమ అభివృద్ధి ఫోరం రాష్ట్ర కన్వీనరు కారు ఆంజనేయులు హెచ్చరించారు. బుధవారం అఖిల పక్ష నేతలు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల కార్యాలయం ఎదుట అఖి లపక్ష కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ అధికారికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లా డుతూ 1982లో రైల్వేకో ఆపరేటివ్ సొసైటీ ద్వారా 496 మందికి రైల్వే ఉద్యోగస్తులకు కడప జిల్లా మామిళ్లపల్లె గ్రామ పొలాల్లోని సర్వేనెంబరు 40, 41, 42 ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరి గిందని.. ఆ స్థలాలను భూ మాఫియా, రిజిస్ట్రార్ మాఫియా ఇద్దరూ కుమ్మక్కై 200 ప్లాట్లకు ఫైబడి ప్లాట్ల యాజమాన్యంతో కానీ రైల్వే డిపార్ట్‌మెంటు సంబంధం లేని వారికి రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. వెంటనే సుందరీషన్ డిప్యుటేషన్ క్యాన్సిల్ చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రెండు రోజుల్లో దీక్షలు చేపడతామని హెచ్చరించారు. చేతివృత్తి దారుల పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లిఖార్జున, రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనరు శివారెడ్డి దళిత మిత్ర సంఘం అధ్యక్షులు రెడ్డన్న, జీఆర్‌డీఎఫ్‌జిల్లా కన్వీనరు బందెల ఓబయ్య, లోక్‌సత్తాపార్టీ అధ్యక్షులు దేవర శ్రీక్రిష్ణ, అఖిలపక్ష నేత జీఆర్‌డీఎఫ్ నేతలు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలి

● టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 3: అబద్ధాలతో పాలన సాగిస్తున్న జగన్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని కడప నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం 46వ డివిజన్ అక్కాయపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఎలా చేపడతారో వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అన్నివర్గాలను వైసీపీ ప్రభుత్వం దగా చేసిందని తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. రాష్ట్రంలో, జిల్లాలోనూ ఎటు చూసినా అరాచకాలు అధికమయ్యాయని వాపోయారు. దీనిని అంత మొందించాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సి ఉందని, చంద్రబాబు నాయుడు సీఎం అయితే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జాకీర్, శివ, యూసఫ్, మల్లితోపాటు పలువురు పాల్గొన్నారు.

వైసీపీకి వచ్చే ఎన్నికల్లో బుద్ధిచెప్పండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పుత్తాసరళమ్మ

కమలాపురం రూరల్, ఏప్రిల్ 3: త్వరలో ఏపీలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో వైసీపీ ప్రభుత్వానికి ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సతీమణి సరళమ్మ, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి సతీమణి శ్రీచైతన్య తెలిపారు. మండల పరిధిలోని చిన్నచెప్పలి పంచాయతీలోని చిన్నచెప్పలి, నసంతపురం, నడింపల్లి గ్రామాల్లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ వైసీపీ ఐదేళ్ల కాలంలో ప్రజలను మోసగించడం తప్ప ఉపయోగపడే ఒక్క పని చేయలేదన్నారు. ఇప్పుడు మళ్లీ ప్రజలను మోసగించడానికి తయారయ్యా రన్నారు. ఈ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

టీడీపీని గెలిపించండి

సికెదిన్నె, ఏప్రిల్ 3: రాబోయే ఎన్నికల్లో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అల్లుడు యశ్వంత్‌రెడ్డి, కుమార్తె దివ్యశ్రీ కోరారు. మండలంలోని తాడిగొట్ల పంచాయతీలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇంటింటికి తిరిగి టీడీపీ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం సమానంగా అందించగలిగే సత్తా కూటమికే ఉందన్నారు. టీడీపీ రాష్ట్రడాక్టర్‌సెల్ కార్యదర్శి క్రిష్ణకిశోర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మోహన్‌బాబు, టీడీపీ నాయకులు ఏటూరు రామచంద్రారెడ్డి, పొల్లోలు సుబ్బిరెడ్డి, నాగేంద్రప్రసాద్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మునీంద్ర యాదవ్, శ్రీనివాసులు, ఓబుళరెడ్డి, నారాయణరెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



విద్యార్థులను బయటికి పంపిస్తున్న ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 3: నిబంధనలకు వ్యతిరేకంగా జూనియర్ కళాశాలలు కొనసాగిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరంలో నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినాల్లో కళాశాలలు నడిపిస్తున్న ఓ ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలను ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పరిశీలించారు. తరగతులను బహిష్కరింపజేసి విద్యార్థులను బయటికి పంపించారు. అనంతరం వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో కూడా మొదటి సంవ త్సరం పూర్తయిన విద్యార్థులకు రెండో సంవత్సరం తరగతులు బోధిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. దీనిపై పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, నగర కార్యదర్శి శివశం కర్, ఉపాధ్యక్షులు తేజా, అఖిరానంద్, అశోక్, రాజేశ్ పాల్గొన్నారు.

కళాశాలల గుర్తింపు రద్దు చేయాలి



ఆర్ఐవోకు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 3: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్ జూనియర్ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం ఆర్ఐవో కార్యాలయంలో ఆర్ఐవో వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్ జూనియర్ కళాశాలలు, జేఈఈ, నీట్, ఎంటెక్ పేర్లతో విద్యార్థులకు రెండో సంవత్సరం పాఠాలు బోధిస్తూ విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నారని తెలిపారు. దీనిపై విచా రణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే కమిషనరుకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

టీడీపీ అభ్యర్థి విజయానికి కృషి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 3: టీడీపీ అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి విజయానికి కృషి చేస్తామని వికలాం గుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అన్నం చిన్నవెంకటసుబ్బయ్య యాదవ్, ఎంఎస్పీ జిల్లా ఇన్ చార్జ్ నరసింహమాదిగ తెలిపారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ మే 13న జరగనున్న ఎన్నికల్లో పుత్తా చైతన్యరెడ్డి గెలుపు కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వ హిస్తామన్నారు. ఎంఆర్ పొత్తులో భాగంగా టీడీపీకి మద్దతు ప్రకటించిందన్నారు. అదేవిధంగా గుంటూ రులో జరిగే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సును విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ మాదిగ, ఎంఎస్పీ అధికార ప్రతినిధి మాతయ్యమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ప్రసాద్‌మాదిగ, లక్ష్మీనారాయణ మాదిగ పాల్గొన్నారు.

పెన్షన్ ఇవ్వకుండా ప్రతిపక్షాలపై నిందలా..?

కమలాపురం రూరల్, ఏప్రిల్ 3: ఖజానాలో డబ్బులను వైసీపీకి చెందిన కొంతమంది ముఖ్యమైన కాంట్రాక్టర్లకు 13వేల కోట్లు పంచి.. పెన్షన్‌దారులకు ఇవ్వడానికి డబ్బులు లేకపోవడంతో ప్రతిపక్షాలపై నిందలు వేయడం సరి కాదని రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పుత్తాయల్లారెడ్డిలు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఖజానాలో ఉన్నడబ్బు అంతా వైసీపీ నాయకుల జేబుల్లోకి పంపించి పెన్షన్లు పంపిణీ చేయకుండా ప్రతిపక్షాలైన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలు కోర్టుకు వెళ్లి వలంటీర్లను పెన్షన్ ఇవ్వకుండా అడ్డుపడ్డారని విష ప్రచారం చేయడం దారుణమన్నారు.

కేంద్ర బలగాలతో కవాతు

మైదుకూరు, ఏప్రిల్ 3 : సార్వత్రిక ఎన్నికలు ఉన్నందున మైదుకూరులో డీఎస్పీ వెంకటేశులు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు మండలంలోని జీవి సత్రం, వనిపెంట తదితర గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ వెంకటేశులు, సీఐ ఏపీ మస్తాన్‌లు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రతి గ్రామాలల్లో 144 సెక్షన్ అమలులో ఉందని, సమావేశాలు, సభలు తదితర వాటికి అనుమతులు తీసుకోవాలన్నారు. అలాగే ఓటర్లను ప్రలోభాలు పెట్టడం గాని లేదా ఇతర సమాచారం పోలీ సులకు ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 3: కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (కెనరా బ్యాంక్ ఆర్‌సేటీ) ఆధ్వర్యంలో నగర శివారు ప్రాంత బాలికల ఐటీఐ పక్కనే గల సంస్థలో టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో జిల్లాలోని గ్రామీణ ప్రాంత వారికి ఈనెల 22 నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎన్.నారాయణరెడ్డి తెలిపారు. 30 రోజులపాటు ఇవ్వనున్న ఉచిత శిక్షణకు 18 నుంచి 45 సంవత్సరాల లోపు గల నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దూర ప్రాంతాల వారికి ఉచిత శిక్షణ సమయంలో ఉచితంగా వసతితో పాటు భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 9440905478, 9956606866, 9440933028 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

గాయపడిన బీసీ నాయకుడికి ఆర్థికసాయం

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 3: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి నంద్యాల సుబ్బరాయుడుకు బీ.సీ. సంక్షేమ సంఘం జిల్లా నాయకులు వైద్యుల ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. బుధవారం నగర 2వ డివిజన్ చలమారెడ్డిపల్లెలోని ఆయన స్వగృహం వద్దకు వెళ్లి కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రసిడెంట్ గోవిందు నాగరాజు, ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ప్రత్యేక డీఎస్పీ

కాశినాయన ఏప్రిల్ 3: రానున్న సాధారణ ఎన్నిక లను దృష్టిలో పెట్టుకొని బుధవారం గొంటు వారిపల్లె.నర్సాపురం,రెడ్డికొట్టాల తదితర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను బద్వేల్ నియోజకవర్గ ప్రత్యేక డీఎస్పీ రవికుమార్ పరిశీలించారు. స్థానిక పరిస్థితులు,కేంద్రాల్లోని మౌలిక వసతులు ఇతర అంశాలను పోరుమామిళ్ల సీఐ చిరంజీవిని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నిలు జరిగే లా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కుంటే జీవితాంతం స్టేషన్‌ల చుట్టూ, కోర్టుల చుట్టూతిగాల్సి వస్తుందని, ప్రజలు ఈవిషయాన్ని గమనించాలన్నారు.

అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప (సెవెన్‌రోడ్స్), ఏప్రిల్ 3: అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య (జీఆర్‌ఎస్‌వైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు డిమాండ్ చేశారు. జీఆర్‌ఎస్‌వైఎఫ్ కార్యాయలంలో ఓబులేసు మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభం కాక ముందే ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యం అక్రమంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు స్వరూపరాణి ధనదాహానికి మండుటెండల్లో వడదెబ్బకు గురై మరణించారన్నారు. అక్రమ అడ్మిషన్లకు తెరలేపి ఇటు విద్యార్థి తల్లిదండ్రులను అటు ప్రైవేటు కార్పొరేట్ ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయడం దారుణమని మండిపడ్డారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్, రాష్ట్ర నాయకులు యూసఫ్, రవి, పవన్, తరుణ్, హరి, మారుతీ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు అనూహ్య స్పందన

మైదుకూరు, ఏప్రిల్ 3: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశ పరీక్షలకు సంబందించి నిర్వహిస్తున్న ఉచిత తరగతులకు అనూహ్య స్పందన లభిస్తోంది. పాలిసెట్ 24 ప్రవేశ పరీక్షలకు గాను కళాశాలలో మార్చి 28 నుంచి ఉచితంగా శిక్షణ తరగతులను ఏర్పాటు చేయగా, కేవలం 10 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ శిక్షణ తరగతులకు బుధవారం నాటికి 65 మంది విద్యార్థులు వస్తున్నారన్నారు. వారందరికీ ఉచిత మెటిరీయల్ కూడా అందిస్తామని ప్రిన్స్‌పాల్ గురుమూర్తి పేర్కొన్నారు.

కె.సుగుమంచిపల్లె వద్ద రూ.10 లక్షల నగదు సీజ్

కొండాపురం, ఏప్రిల్ 3 : మండలంలోని జిల్లా సరిహద్దుల్లోని కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్ట్ వద్ద బుధవారం సాయంత్రం పోలీసులు రూ.10 లక్షల నగదును సీజ్ చేశారు. తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా ఈ నగదును స్వాధీనపరచుకున్నారు. అనంతపురం నుంచి ప్రొద్దుటూరుకు కారులో శ్రీదేవి అనే మహిళ వెళుతుండగా ఆమె నుంచి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించిన సరైన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నగదును ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రాయచోటిలో రూ.4 లక్షలు...

రాయచోటిటౌన్, ఏప్రిల్ 3: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు బుధవారం రాయచోటి అర్బన్ పోలీసులు వాహనాల తనిఖీల్లో భాగంగా ఎటువంటి ఆధారాలు లేని రూ.4 లక్షల నగదును సీజ్ చేశారు. అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు వివరాల్లోకి వెళితే.. బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో గల వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో రెడ్డిశేఖర్‌రాజు అనే వ్యక్తి ఎటువంటి రసీదులు లేని రూ.4 లక్షలు నగదు ద్విచక్రవాహనంపై తీసుకెళుతుండగా నగదును సీజ్ చేసి విషయాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తెలియజేయడంతో పాటు సదరు నగదును ట్రెజరీలో డిపాజిట్ చేసినట్లు సీఐ తెలిపారు.

తాళ్లపాకలో ఇంట్లోకి వచ్చిన దుప్పి



రాజంపేటటౌన్, ఏప్రిల్ 3: రాజంపేట మండల పరిధిలోని అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలో అడవి దుప్పి ప్రత్యక్షమైంది. ఆ జింకను గ్రామంలోని కుక్కలు వెంట పడటంతో గ్రామంలోని జవ్వాజి శివయ్య ఇంటిలోకి వచ్చింది. దీంతో స్థానికులు దానిని అతికష్టంపై బంధించి వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చి వారికి అప్పగించారు. కుక్కల దాడిలో దుప్పికి గాయాలు ఉండటంతో దుప్పికి వైద్య చికిత్సలు చేసి అనంతరం అడవిలోకి వదిలిపెడతామని అటవీ శాఖాధికారులు తెలిపారు.

గండి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతలకు స్వామి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

చక్రాయపేట, ఏప్రిల్ 3: గండి వీరాంజనేయస్వామి క్షేత్రంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116 విరాళం వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, ఛైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. బుధవారం యర్రగుంట్ల పట్టణానికి చెందిన తుంగా వెంకటరామిరెడ్డి (రైల్వే కాంట్రాక్టర్), ఆయన సతీమణి అమృతలక్ష్మి ఈ విరాళం అందించారన్నారు. వీరికి ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరి, రాజారమేష్‌లు స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, శేషవస్త్రంతో వేద ఆశీర్వచనం చేసినట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో అరటి తోట దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కాశినాయన ఏప్రిల్ 3: మండలంలోని అక్కంపేట గ్రామం వద్ద బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 5 ఎకరాల అరటితోట కాలిపోయినట్లు గ్రామస్థులు, బాధిత రైతులు మురుకూటి శ్రీనివాసుల రెడ్డి, మురుకూటి గురివిరెడ్డి (బంగారు గుర్విరెడ్డి) తెలిపారు. బాధి త కుటుంబాల వివరాల మేరకు మధ్యాహ్న సమయంలో కరెంట్ లైన్ పైనుంచి అగ్గిరవ్వలు పడి మంటలు అంటుకున్నాయన్నారు. గుర్తించిన వెంటనే పోరుమామిళ్ల ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు మంటలు పక్కతోటలకు వ్యాపించకుండా ఆర్పివేశారన్నారు. ప్రమాదంలో కటింగ్‌కు వచ్చిన 5 ఎకరాల్లోని అరటి గెలలు, డ్రిప్ పైపులు వ్యవసాయ మోటారు వైర్లు, పైపులు పూర్తిగా కాలిపోయాయన్నారు. దాదాపు రూ.5 లక్షల నష్టం ఏర్పడిందని బాధిత రైతులు తెలిపారు.

ముగిసిన ఇంటర్ మూల్యాంకనం



మాట్లాడుతున్న ఆర్ఐవో వెంకటసుబ్బయ్య

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 3: కడప నగరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ మూల్యాంకన కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆర్ఐవో వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కడప జిల్లాకు లక్షా 84 వేల 907 జవాబుపత్రాలు మూల్యాంకనానికి వచ్చాయన్నారు. వాటిని అధికారులు, ప్రిన్సిపాల్, జూనియర్ లెక్చరర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది సహకారంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

లా అండ్ మేనేజ్‌మెంట్ డీన్‌గా సుబ్బరాయుడు



నియామకపత్రం అందిస్తున్న వీసీ

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 3 : వైవీయూ ఫ్యాకల్టీ ఆఫ్ కామర్ లా అండ్ మేనేజ్‌మెంట్ డీన్‌గా ప్రొఫెసరు వై.సుబ్బరాయుడును నియమిస్తూ వైస్ చాన్సలర్ సుధాకర్ నియామకపత్రం తన ఛాంబరులో అందించారు. ఇది వరకు డీన్‌గా ఈ స్థానంలో పనిచేసిన ప్రొఫెసరు శ్రీనివాస్ పదవీ కాలం పూర్తి కావడంతో ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. నూతన డీన్‌గా నియమితులైన ప్రొఫెసరు సుబ్బరాయుడు మూడేళ్లపాటు ఈ బాధ్యతలో కొనసాగుతారు. అకడమిక్ పరిశోధనల పరంగా ఆయా విభాగాల అభివృద్ధికి కృషి చేయాలని వీసీ ప్రొఫెసరు చింతా సుధాకర్, రిజిస్ట్రారు వెంకటసుబ్బయ్య సూచించారు.

హెడెక్స్ కోర్సులో నమోదుకు విశేష స్పందన




విద్యార్థులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 3: వైవీయూలో హెడెక్స్ అందించే కోర్సుల్లో నమోదు కేంద్రాన్ని ప్రిన్సిపాల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి సందర్శించారు. ఈ కోర్సులో 400 మంది ఫ్యాకల్టీ విద్యార్థుల వారి పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ కోర్సులో చేరడం ద్వారా ప్రపంచంలో ప్రముఖ యూనివర్శిటీల ఫ్యాకల్టీల లెక్చర్స్ వీడియోస్ చూడడంతో పాటు మెటీరియల్స్‌ను విద్యార్థులు ఉచితంగా పొంది వాటిని సాధన చేయాలన్నారు. తద్వారా ప్రపంచస్థాయి జ్ఞానాన్ని పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో హెడెక్స్ ప్రోగ్రాం కోర్సు ఛాంపియన్ కె.శ్రీనివాసరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి రెడ్డెయ్య పాల్గొన్నారు.

రైలుకింద పడి యువకుడు మృతి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 3: నగర పంచాయతీ పరిధిలోని చెరువుకట్ట వద్ద మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని యువకుడు రైలుకింద పడి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని శవం లభ్యం



చక్రాయపేట, ఏప్రిల్ 3: మండలంలోని నాగులగుట్టపల్లె వద్ద గుర్తుతెలియని మగశవం లభ్యమైనట్లు ఎస్‌ఐ తెలిపారు. మండలంలో మొలతాడు దారాలు అమ్ముకుంటూ ఉండి బుధవారం నాగులగుట్టపల్లె వద్ద చనిపోయి ఉన్నాడన్నారు. మృతుడి ఎడమచేతిపై ఎం.రాణి అని పచ్చబొట్టు ఉందని, ఆచూకీ తెలిస్తే చక్రాయపేట ఎస్‌ఐ 9121100557 నెంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

నిషా కోసం తప్పటడుగులు



- విచ్చలవిడిగా సొల్యూషన్, మాత్రలు, ఇంజక్షన్ల వినియోగం
- కొరవడిన సంబంధిత అధికారుల నిఘా
- తల్లిదండ్రులు గమనించకపోతే పిల్లల జీవితాలు బుగ్గిపాలే

కడపలో యువత మత్తుకు చిత్తై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఎక్కువ శాతం 13 నుంచి 23 సంవత్సరాల పిల్లలే దీని పట్ల ఆకర్షితులై తమ కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిలిస్తున్నారు. గంజాయి మత్తు దాటి సొల్యూషన్, మాత్రలు, ఇంజక్షన్లు తీసుకునే స్థాయికి వచ్చారు. మత్తు పదార్థాలు కొనడానికి డబ్బులు లేకపోవడంతో కొంత మంది చోరీల బాట పడితే మరికొందరు గొడవలకు పాల్పడుతున్నారు.



కడప (క్రైం), ఏప్రిల్ 3: కొందరు మైనర్లు, యువత జులాయిగా తిరుగుతూ చెడు స్నేహాలతో మత్తుకు అలవాటు పడుతున్నారు. మొదట సిగరెట్లతో ప్రారంభించి, తరువాత గంజాయి, ఆ తరువాత ఇంకా మత్తు ఎక్కేందుకు మాత్రలు, ఇంజక్షన్లకు అలవాటుపడి మత్తుకు బానిస అవుతున్నారు. కడప నగరంలో కొంత మంది యువత జన సంచారం లేని ప్రాంతాలకు వెళ్లి అక్కడ ఈ ప్రయోగాలు చేస్తూ వారి ఆయుష్షను చేజేతులా తగ్గించుకుంటున్నారు. గంజాయి మత్తు చాలకపోవడంతో మత్తు ఇచ్చే కొన్ని రకాల మాత్రలు, ఇంజక్షన్లు డాక్టర్లు ఇచ్చే ప్రిస్క్రిప్షన్ లేకుండానే మెడికల్ ఏజన్సీల నుంచి తెచ్చుకుని యథేచ్ఛగా వినియోగిస్తున్నారు.

ఎదిగే పిల్లలను పట్టించుకోని తల్లిదండ్రులు

పెరిగే పిల్లల పట్ల తల్లిదండ్రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. పగలు రాత్రి తేడా లేకుండా వారు ఎక్కడ తిరిగినా, ఎన్ని గంటలకు ఇంటికి వచ్చినా ప్రశ్నించడం లేదు. వారిపై నిఘా ఉంచడంలేదు. ఇలాంటి పిల్లల్లో కొందరు మత్తు పదార్థాల బారినపడుతున్నారు. గతంలో గంజాయి, గుట్కాలు, మద్యం, స్టెరాయిడ్స్ లాంటి మత్తు పదార్థాలను వినియోగించేవారు. చాలా మంది యువకులు మత్తు ఎక్కువగా ఎక్కడానికి కొన్ని రకాల టానిక్‌లు, సర్జికల్స్ స్పిరిట్స్, కొన్ని రకాల మాత్రలు.. వైద్యుల పర్యవేక్షణలో వినియోగించే కొన్ని రకాల మత్తు ఇంజక్షన్లు వాడుతున్నారు. కొందరు ఫెవికిక్, శానిటైజరును కూడా మత్తు కోసం వాడుతున్నట్లు సమాచారం. పిల్లల పట్ల తల్లిదండ్రులే బాధ్యత తీసుకుని వారిపై నిరంతరం నిఘా ఉంచకపోతే చేజేతులా వారి జీవితాలను నాశనం చేసిన వారవుతారు. జిల్లాలో ప్రస్తుతం చాలా చోట్ల రహదారుల వెంట, తుప్పలు, బస్టాండ్ల వద్ద చెత్త కుప్పల్లో మత్తు కోసం వినియోగించే ఇంక్షన్లు, మాత్రలు ఇతర ప్రత్యామ్నాయ పదార్థాల ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. వీటిలో చాలా పదార్థాలు నిత్యం ప్రజలకు ఏదో ఒక పనికి వినియోగించేవే కావడం విశేషం.

మత్తుకు యువత చిత్తు

యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. నూరేళ్ల జీవితాన్ని మధ్యలోనే చాలించేస్తున్నారు. మత్తుకు అలవాటు పడి అనేక అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. దీనిపై తల్లిదండ్రులు అప్రమత్తమై పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించకపోతే వారి భవిష్యత్తు అంధకారబంధురం అయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వ యంత్రాంగం కూడా వీటి వినియోగంపై నిఘా పెట్టి నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.100 మాత్రలు రూ.1200లకు విక్రయాలు

డాక్టరు అనుమతి లేకుండా కొంతమంది ఏజంట్లు వంద రూపాయల విలువ చేసే మత్తు ట్యాబ్లెట్లను రూ.1200కు పైగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మత్తు ఎక్కించే మాత్రలు వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మకూడదనే నిబంధన ఉన్నప్పటికీ కొంత మంది ఈ మాత్రలు విచ్చలవిడిగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.


కడపలో మత్తు బ్యాచ్‌లు

కడప నగరంలో గంజాయి, ఇంక్షన్, సొల్యూషన్ పీల్చే బ్యాచ్‌లు ఇటీవల ఎక్కువగా కనిపిస్తున్నాయి. అల్మాస్‌పేట, వక్కలపేట, చిలకలబావి, ఖలీల్‌నగర్, బుగ్గవంక ప్రహరీ ప్రాంతాల్లో ఎక్కువ మంది యువకులు గంజాయి, ఇంజక్షన్లు వాడుతూ కనిపిస్తున్నారు. అలాగే రవీంద్రనగర్, తిలక్‌నగర్, బిల్టప్ సర్కిల్, అంగడివీధి ప్రాంతాల్లో 12 సంవత్సరాల నుంచి 23 సంవత్సరాల వారు అధికంగా ఈ మత్తుకు బానిసై తిరుగుతున్నారు. ఇటువంటి వారిపై తల్లిదండ్రులు, అధికార యంత్రాంగం దృష్టి సారించి అదుపు చేయకపోతే రేపటి యువత భవిష్యత్తు అంధకారమయ్యే అవకాశాలున్నాయని పలువురు అంటున్నారు.

నిఘా ఏదీ..?

వైద్య ఆరోగ్య శాఖ అధికారుల నిఘా కొరవడ్డంతోనే వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు కలిగించే మాత్రలు, ఇంజక్షన్లు అధిక ధరలకు అమ్ముతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో యువత మత్తుకు బానిస అవుతున్నారు. అలాగే మత్తులో జోగుతున్న యువతను పోలీసులు గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వడం.. జనావాసాలకు దూరంగా ఏకాంత ప్రదేశాల్లో మత్తుసేవించే వారిపై నిఘా పెంచకపోడం పట్ల కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మత్తుతో ఊగే యువత పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

రేపటి నుంచి అన్నమయ్య వర్ధంతి వేడుకలు



రాజంపేట, ఏప్రిల్ 3: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య 521వ వర్ధంతి వేడుకలను టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు బుధవారం తాళ్లపాక ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలో, బోయనపల్లెలోని 108 అడుగుల విగ్రహం వద్ద టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగా 5వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు తాళ్లపాక గ్రామంలోని అన్నమాచార్య ధ్యానమందిర ప్రాంగణంలో సప్తగిరుల సంకీర్తనా గోష్ఠిగానం, సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు కె.శ్రీనివాస బృందం వారిచే సంగీత సభ, వై.రమేష్‌బాబు బృందం ఆధ్వర్యంలో హరికథ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 6వ తేదీ సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు ఎం.బి.లోకనాధం బృందం వారిచే సంగీత సభ, వై.శ్రీనివాస్ బృందం వారిచే హరికథ, 7వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు ఎం.మోహన్ బృందం వారిచే సంగీత సభ, అనంతరం కె.చంద్రశేఖర్ బృందం వారిచే హరికథ, 8న ఎం.రవిచంద్ర బృందం వారిచే సంగీత సభ, ఎం.పూర్ణిమ బృందం వారిచే హరికథ కాలక్షేపాలు ఉంటాయన్నారు. ఈ ఉత్సవాలు 4వ తేదీ నుంచి తిరుపతి అలిపిరి పాదాల మండపం అన్నమాచార్య కళా మందిరం వద్ద ప్రారంభమవుతాయని తెలిపారు. 5వ తేదీ అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక గ్రామం నారాయణగిరిలో ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. భక్తులందరూ ఈ ఉత్సవాలకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

- డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు
- మృతదేహాన్ని పరిశీలించిన డీఎస్పీ



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న డీఎస్పీ మహబూబ్‌బాషా, మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

సుండుపల్లె, ఏప్రిల్ 3: మండలంలోని పొలిరపల్లె గ్రామ పంచాయతీ గుంతరాచపల్లె సమీపంలో సంబేపల్లె మండలం ఊటుపాలెంకు చెందిన కొండమల్ల ఈశ్వరయ్య (50) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా బుధవారం తెలిపారు. వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు డాగ్స్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించామన్నారు. సోమవారం పూజారివాండ్లపల్లె చింతకూటమ్మ తల్లి తిరుణాలకు మృతుడు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రాయచోటికి తరలించామన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్, ఎస్‌ఐ ఎస్కేయం హుస్సేన్, ఏఎస్‌ఐ వెంకట్రమణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కలుషిత నీరు తాగి 22 గొర్రెలు మృతి



చనిపోయిన గొర్రెలు, కలుషిత నీరు ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వెటర్నరీ డీడీ వెంకటరమణ

చెన్నూరు, ఏప్రిల్ 3: చెన్నూరు గ్రామ వ్యవసాయ పొలాల్లో కలుషిత నీరు తాగి 22 గొర్రెలు మృతి చెందాయి. ఇటుక బట్టీలకు వాడే నీటిలో రసాయనిక ఎరువులు కలపడం వల్ల ఆ నీటిని తాగడంతో గొర్రెలు మృతి చెందాయని దాదాపు రూ.4 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పెండ్లిమర్రి మండలంలోని పలు గ్రామాలకు చెందిన గొర్రెల పెంపకందారులైన వడ్డారపు చిట్టిబాబు, పి.గంగరాజు, బి.గంగిరెడ్డి, బి.ప్రసాద్, ఆంజనేయులు తదితరులు దాదాపు నెలరోజులుగా చెన్నూరుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గొర్రెలు మేపుకుంటున్నారు. మూడురోజుల క్రితం చెన్నూరు బుడ్డాయపల్లె గ్రామ సమీపంలో వ్యవసాయ పొలాల్లో రాత్రివేళ గొర్రెలను ఉంచుకుని వాటిని మేపుకుంటున్నారు. బుధవారం ఉదయం సమీపంలోని ఇటుకబట్టీల వద్దకు గొర్రెలు వెళ్లి నీరు తాగడంతో 22 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. మొదట గొర్రెల పెంపకందారులకు ఏమీ అర్థం కాలేదు. తీరా అవి కలుషితనీరు తాగడంతో మృతి చెందాయని తెలుసుకుని బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలిసిన పశువైద్యశాఖ డీడీ వెంకటరమణ, ల్యాబ్ వైద్యులు రాంబాబు, ఖాజీపేట చెన్నూరు పశువైద్యాధికారులు మురళి, డాక్టర్ ఉపేంద్రలు చనిపోయిన గొర్రెలను పరిశీలించారు. మిగిలిన గొర్రెలు కూడా అస్వస్థతకు గురి కావడంతో వాటికి చికిత్స చేశారు. గొర్రెల మృతిపై విచారణ చేపడతామని వారు తెలిపారు. ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ బాలయ్య, గొర్రెల పెంపదారుల జిల్లా అధ్యక్షుడు మల్లయ్య, అటవీశాఖ డైరెక్టరు శ్రీలక్ష్మి తదితరులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి బాధితులకు ప్రభుత్వపరంగా సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు.

ఇరువురికి జైలు శిక్ష

రాయచోటిటౌన్, ఏప్రిల్ 3: చోరీ కేసులో ఇరువురు నిందితులకు రెండు నెలల సాధారణ జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ బుధవారం అడిషినల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శారద తీర్పునిచ్చారు. ఫిబ్రవరి 19న రాత్రి రాయుడు కాలనీకి చెందిన ఎదివీటి దేవుడు, షేక్ ఫయాజ్ రాయచోటి పట్టణంలోని కొత్తపేట విజయవాడ స్కూల్ సమీపంలో నివాసముంటున్న గుంటిమడుగు త్యాగరాజు ఇంటిలో ఇన్వర్టర్ బ్యాటరీని చోరీ చేశారు. రాయచోటి అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసుపై విచారించిన మేజిస్ట్రేట్ వీరిరువురికి జైలుశిక్ష, జరిమానా విధించారు.

డ్రైవరు మృతి



బద్వేలు టౌన్, ఏప్రిల్ 3: పట్టణంలోని మైదుకూరు రోడ్డు జాతీయ రహదారిలో బుధవారం లారీ డ్రైవ రు గోరోజు అశోక్ (32) మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు మూడురోజుల నుంచి లారీ రోడ్డు పక్కన ఆపుకుని ఉన్నాడని, బుధవారం మధ్యాహ్నం కూడా లారీ రిపేరు చేసుకోవడం గమనించామని అన్నారు. ఎండ అధికంగా ఉండడంతో వడదెబ్బకు గురి కావడంతో మృతి చెందినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడు తెలంగాణ రాష్ట్రం సూర్యపేట జిల్లా వింపటి గ్రామానికి చెందిన డ్రైవరు అశోక్‌గా పోలీసులు గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఇరువురికి గాయాలు



ఘర్షణలో గాయపడ్డ రామాంజనేయులు, సయ్యద్ జాఫర్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 3: రాయచోటి పట్టణంలోని గున్నికుంట్ల రహదారి ఎస్పీ బంగ్లాకు సమీపంలో స్థల విషయంపై బుధవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. సర్వే నెంబర్ 374/4ఏలో 20 సెంట్ల స్థలం పల్లపు రామాంజనేయులు అనుభవంలో ఉంది. అయితే పల్లపు రామాంజనేయులు వర్గం వారు ఆ స్థలంలో గునాది కట్టడానికి ప్రయత్నిస్తుండగా సయ్యద్ జాఫర్ అనే వ్యక్తి అక్కడికి వెళ్లి ఇందులో నాకు కూడా హక్కు ఉందంటూ అడ్డుపడడంతో ఇరువర్గాల మధ్య మాటమాట పెరిగింది. రెండు వర్గాల మధ్య వివాదం నెలకొనడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రెండు వర్గాల్లోని వారు పరస్పరం రాళ్లు, కర్రలతో దాడులకు తెగబడ్డారు. ఈ దాడిలో పల్లపు రామాంజనేయులతో పాటు సయ్యద్ జాఫర్‌లు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డిని వివరణ కోరగా... ఘర్షణకు సంబంధించి తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత వరద

టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి



ప్రొద్దుటూరు, ఏప్రిల్ 3 : ప్రొద్దుటూరుకు ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అదంతా నంద్యాల వరదరాజులరెడ్డి హయాంలో జరిగిందేనని అందువల్లే ఆయన ప్రొద్దుటూరు అభివృద్ధి ప్రదాతగా నిలిచాడని టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి పేర్కొన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో కొండారెడ్డి మాట్లాడుతూ వరదరాజులరెడ్డి చేసిన అభివృద్ధి పై రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఎన్ని రకాలుగా అసత్య ప్రచారాలు చేసినా ఆకాశంమీద ఉమ్మేసినట్లేనన్నారు. 1994 కంటే ముందే మైదుకూరు రోడ్డు విస్తరణ జరిగిందన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్లన్నీ తీసుకువచ్చి ప్రతి గ్రామానికి విద్యుత్ సరఫరా అందించాడన్నారు. ప్రొద్దుటూరు కు రింగురోడ్డు తెచ్చిన ఘనత వరదదే అన్నారు. కుందూ పెన్నా నదులమీద బ్రిడ్జిలు నిర్మించి రాజుపాళెం మండలం, చాపాడు మండలంలో గ్రామాలకు రవాణాను అనుసంధానం చేశాడన్నారు. ప్రతి గ్రామానికి తారురోడ్డు సౌకర్యం కల్పించారన్నారు. పొట్లదుర్తి, చాపాడు హైలెవెల్ బ్రిడ్జిలు నిర్మించారన్నారు. గాంధీరోడ్డుతో పాటు జిన్నా రోడ్డు విస్తరణ చేపట్టి గంగమ్మదేవళం వీధిలోని మండి బజార్‌ను జిన్నా రోడ్డు లోని మెకానిక్ షెడ్లను ఆటో నగర్‌కు తరలించి ప్రొద్దుటూరు విస్తరణకు పాటుపడారన్నారు. గాంధీరోడ్డును సైతం ఆనాడే విస్తరించారన్నారు. 2004 తరువాత ప్రొద్దుటూరుకు జిల్లా కోర్టుకు ఆధునాతన బిల్డింగులు వైఎస్ ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, వెటర్నరీ కాలేజీ, వంద పడకలనుంచి 350 పడకల జిల్లా స్థాయి ఆసుపత్రి, అమృత నగర్ టౌన్‌షిప్‌లో వేలాది మందికి వందల ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టారన్నారు. అంతకు ముందే కేరళకు చెందిన అమృతానందమయి ట్రస్టు నిధులతో పేదలకు ఉచితంగా ఆమె పేరుతో కాలనీ నిర్మించారన్నారు. కేసీ కెనాల్ మైలవరం కాలువల ఆధునీకరణ పనులు చేపట్టారన్నారు. నాడు వరదరాజులరెడ్డి ప్రభుత్వ ఆదాయం పెంచే పనులు చేస్తే నేడు రాచమల్లు ప్రసాద్‌రెడ్డి వాటిని అడ్డంగా దోచుకుతినడం తప్ప అభివృద్ధి చేయలేదన్నారు.

వైసీపీ నాయకులు వెయ్యి కోట్ల ఇసుక దోపిడీ

మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్

చాపాడు, ఏప్రిల్ 3: వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని కుందూ, పెన్నా నదుల్లో సుమారు వెయ్యి కోట్ల రూపాయల ఇసుకను అక్రమంగా దోపిడీ చేసి అమ్ముకున్నారని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. అల్లాడుపల్లె గ్రామంలో బుధవారం సాయంత్రం వైసీపీకి చెందిన వంద కుటుంబాలవారు టీడీపీలో చేరారు. కడప పార్లమెంటు టీడీపీ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేశ్ రెడ్డి, సుధాకర్‌యాదవ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరినవారిలో ఎర్రమాచు వెంకటేశ్వరరెడ్డి, యల్లారెడ్డి, వీరనాయణయాదవ్, వెంకటరెడ్డి, జాఫర్, బషీర్, సుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వీరారెడ్డి, నారాయణరెడ్డి, కుమార్‌రెడ్డి, ఇంకా 90 కుటుంబాలవారు ఉన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డికి గత 35 ఏళ్లుగా ఓట్లు వేసి సహకరించామన్నారు. ఇటీవల ఆయన దౌర్జాన్యాలు, అరాచకలు, వేధింపులు భరించలేక టీడీపీలో చేరుతున్నట్లు చెప్పారు. ఆయన ఓటమిని తాము చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి మాచనూరు సుబ్బరాయుడు, జనసేన ఇన్‌చార్జి మల్లోత్ర, టీడీపీ నాయకులు వేమారెడ్డి, రజని, గురివిరెడ్డి, నారపురెడ్డి, వీరశేఖర్‌రెడ్డి, మేకల బాబు, వీరనారాయణ, హర్షవర్ధన్‌రెడ్డి, రామాంజనేయులు, పసల రమణ, గోర్ల సుబ్బరాయుడు, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.



వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న పుట్టా, మాట్లాడుతున్న భూపేశ్‌రెడ్డి

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న దృశ్యం

బద్వేలు టౌన్, ఏప్రిల్ 3: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ బద్వేలు సమన్వయ కర్త రితీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని విద్యానగర్‌లో వైసీపీ వైస్‌ఛైర్మన్ గోపాలస్వామి అన్న గోపయ్య మరికొంతమంది సుబ్బరాయుడు, సాంబశివారెడ్డి పలు కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో ఓటు అమ్మకానికి కాకుండా నమ్మకానికి వేయాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, బద్వేలు పట్టణ మున్సిపాలిటీ అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్ పార్థసారధి, సాంబశివారెడ్డి, మిత్తికాయల రమణ, భూపాల్‌రెడ్డి సుబ్బరాయుడు, కొండయ్య, సింగరయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్న ఇంటింటి ప్రచారం



ఎన్నికల ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్న

పోరుమామిళ్ల, ఏప్రిల్ 3 : బద్వేలు నియోజకవర్గం నుంచి ఉమ్మడి అభ్యర్థిగా బీజేపీ తరఫున పోటీ చేస్తున్న బొజ్జ రోశన్న ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుధవారం ఆయన పోరుమామిళ్లలోని శివాలయం వీధి, నాయీ బ్రాహ్మణవీధి, కొలిమిప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్లసర్పంచ్ యనమల సుధాకర్, టీడీపీ నాయకులు సీతా వెంకట సుబ్బయ్య, ఇమాంహుస్సేన్, రంతుల్లా, అతికారి రాజా, వెంకటేశ్వర్లు, నెంబరువలి కుమారుడు మస్తాన్‌వలి, మాజీ ఎంపీటీసీ శెట్టెం ప్రతాప్, బీజేపీ నాయకులు పల్లెంశెట్టి పండరి, రమణాచారి, జయరాం, జనసేన నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు అనూహ్య స్పందన

మైదుకూరు, ఏప్రిల్ 3 : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశ పరీక్షలకు సంబంధించి నిర్వహిస్తున్న ఉచిత తరగతులకు అనూహ్య స్పందన లభిస్తోంది. పాలిసెట్ 24 ప్రవేశ పరీక్షలకు గాను కళాశాలలో మార్చి 28 నుంచి ఉచితంగా శిక్షణ తరగతులను ఏర్పాటు చేయగా, కేవలం 10 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ శిక్షణ తరగతులకు బుధవారం నాటికి 65 మంది విద్యార్థులు వస్తున్నారన్నారు. వారందరికీ ఉచిత మెటీరియల్ కూడా అందిస్తామని ప్రిన్స్‌పాల్ గురుమూర్తి పేర్కొన్నారు.

కేంద్ర బలగాలతో కవాతు



మైదుకూరు, ఏప్రిల్ 3 : సార్వత్రిక ఎన్నికల ఉన్నందున మైదుకూరులో డీఎస్పీ వెంకటేశులు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు మండలం లోని జీవి సత్రం, వనిపెంట తదితర గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేశులు, సీఐ ఏపీ మస్తాన్‌లు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రతి గ్రామాలల్లో 144 సెక్షన్ అమలులో ఉందని, సమావేశాలు, సభలు తదితర వాటికి అనుమతులు తీసుకోవాలన్నారు. అలాగే ఓటర్లను ప్రలోభాలు పెట్టడం గాని లేదా ఇతర సమాచారం పోలీసులకు ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు.

రేపు బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి సభ

జమ్మలమడుగు, ఏప్రిల్ 3: జమ్మలమడుగులోని మున్సిపల్ కార్యాలయం సమీపాన ప్రధాన రోడ్డు పక్కన ఈనెల 5వ తేదీ శుక్రవారం సాయంత్రం 3.30 గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు బీజేపీ, టీడీపీ జనసేన ఉమ్మడి సభ నిర్వహిస్తున్నట్లు కార్యకర్తలు, నాయకులు, తరలి వచ్చి విజయవంతం చేయాలని బీజేపీ కార్యాలయ కమిటీవారు తెలిపారు. ఈ సమావేశం కడప టీడీపీ పార్లమెంటు అభ్యర్థి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి, జమ్మలమడుగు ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు తరలి రావాలని వారు కోరారు.

క్రైస్తవుల సూపర్-6 పథకాల పోస్టర్ల విడుదల

జమ్మలమడుగు, ఏప్రిల్ 3: జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం క్రైస్తవులకు ప్రత్యేకంగా చంద్రబాబు రూపొందించిన సూపర్-6 పథకాల పోస్టర్లను టీడీపీ కడప పార్లమెంటు అభ్యర్థి భూపేశ్‌సుబ్బరామిరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ క్రిస్టియన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు, ఉపాధ్యక్షుడు కవ్వా రమేష్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, శ్యాం, మోహన్, రమణయ్య, శ్రీనివాసులరెడ్డి, గోపాల్, కుళాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి అంత్యక్రియలు

జమ్మలమడుగు, ఏప్రిల్ 3: జమ్మలమడుగులోని నాగులకట్ట వీధిలో నివాసం ఉంటున్న మదనకోళ్ల లక్షుమయ్య (72) అనే వృద్ధుడికి అంతిమ సంస్కారాలు చేయడానికి మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ అధ్యక్షుడు మోరే లక్ష్మణరావు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వృద్ధుడికి అన్నీ తామై అంత్యక్రియలు నిర్వహిస్తున్నామన్నారు. మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులు సుబహాన్, మునీంద్ర, గురురాజశేఖర్, పాపిశెట్టి వెంకటలక్షుమ్మ, సుమన్‌బాబు పాల్గొన్నారు.

'ఇండియా కూటమితోనే అభివృద్ధి '

బద్వేలు, ఏప్రిల్ 3: సార్వత్రిక ఎన్నికలలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అభివృద్ధికి బాటలు వేస్తుందని కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్‌డీ.విజయజ్యోతి , సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్‌లు పేర్కొన్నారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం, లౌకిక వాదం అనేవి కనుమరుగైపోతున్నాయని, రోజురోజుకు నియంతృత్వం పెరిగిపోతోందని మతతత్వ బీజేపీ మనుషుల మధ్య విభజన తీసుకువచ్చిందని వారు ఆరోపించారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా, రాష్ట్రం అభివృద్ధిచెందాలంటే ఇండియా కూటమిని గెలిపించాలన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, వెంకటరమణ, ఇమ్మానుయేల్, పి.వి.రమణ, సీపీఎం పట్టణ కమిటి సభ్యులు చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ప్రత్యేక డీఎస్పీ

కాశినాయన ఏప్రిల్ 3: రానున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బుధవారం గొంటువారిపల్లె,నర్సాపురం,రెడ్డికొట్టాల తదితర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను బద్వేల్ నియోజకవర్గ ప్రత్యేక డీఎస్పీ రవికుమార్ పరిశీలించారు. స్థానిక పరిస్థితులు,కేంద్రాల్లోని మౌలిక వసతులు ఇతర అంశాలను పోరుమామిళ్ల సీఐ చిరంజీవిని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నిలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కుంటే జీవితాంతం స్టేషన్‌ల చుట్టూ, కోర్టుల చుట్టూతిగాల్సి వస్తుందని, ప్రజలు ఈవిషయాన్ని గమనించాలన్నారు.

టీడీపీ విజయాన్ని ఆపలేరు



ప్రచారంలో పాల్గొన్న భూపేశ్‌రెడ్డి, వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 3 : వైసీపీ ఎన్ని రకాలుగా టీడీపీపై దుష్ప్రచారాన్ని సాగించినా టీడీపీ విజయాన్ని ఆపలేరని ఆపార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు భూపేశ్ రెడ్డి, వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఒకటో వార్డు బొల్లవరంలో టీడీపీ ఎన్నికల ప్రచారం చేపట్టింది. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్ళి టీడీపీ పథకాలపై ప్రచారం సాగించారు. సైకిల్ గుర్తుకు ఓటేయ్యాలని చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, వీఎస్ ముక్తియార్, మాజీ ఎంపీపీ లక్ష్మీపేట గురివిరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు, ఈవీ సుధాకర్‌రెడ్డి ,కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి,మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మెన్ కామిశెట్టి బాబు, ధనిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, యనమల సుబ్బిరెడ్డి, జనసేన ప్రతినిధి సుంకర మురళి, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లతో మతసామరస్యం పెంపొందుతుంది

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 3 : ఇఫ్తార్ విందులతో హిందూ-ముస్లింల ఐక్యత మతసామరస్యం పెంపొందుతుందని వరదరాజులరెడ్డి, భూపేశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాలులో వక్ఫ్‌బోర్డు మాజీ ఛైర్మెన్ బేపారి జాకీర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కడపనుంచి టీడీపీ నాయకుడు అమీర్‌బాబు, వీఎస్ ముక్తియార్, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు మహ్మద్ గౌస్, మునీర్, వెల్లాల భాస్కర్, బేపారి బషీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

సొంత చెల్లినే నమ్మించి మోసం చేసిన జగన్



మాట్లాడుతున్న ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 3: రాష్ట్రంలో ప్రజలకన్నా ముందుగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆయన సొంత చెల్లెలు వైఎస్ షర్మిలనే నమ్మించి మోసం చేశారని జమ్మలమడుగు బీజేపీ అభ్యర్థి సి.ఆదినారాయణరెడ్డి కార్యకర్తలకు తెలిపారు. బుధవారం ఉదయం జమ్మలమడుగు బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం అప్పులపాలేకాకుండా అభివృద్ధికి నోచుకోక సర్వనాశనం చేశారన్నారు. జగన్‌రెడ్డిని ఆయన పరిపాలనను విమర్శిస్తే అక్రమ కేసులు పెట్టి అందరికీ ఇబ్బంది కలిగించాడన్నారు. అనంతరం ఆదినారాయణరెడ్డి కుమారుడు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త జమ్మలమడుగులో సైనికుల్లా పనిచేసి కూటమి అభ్యర్థి ఆదినారాయణరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చదిపిరాళ్ల శివనారాయణరెడ్డి, డీకే కొండారెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలోకి వలసలు ప్రారంభం

జమ్మలమడుగు, ఏప్రిల్ 3: జమ్మలమడుగులో రెండు రోజుల నుంచి వలసలు ప్రారంభమయ్యాయి. టీడీపీ కూటమి అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి రెండు రోజులుగా కార్యాలయం వద్దకు చేరుకుని అన్ని ప్రాంతాల కార్యకర్తలు, నాయకులతో ఫోన్‌లో సంప్రదించి ఆహ్వానిస్తున్నారు. అందులో భాగంగా పెద్దముడియం మండలం పాలూరు గ్రామానికి చెందిన సుమారు పది కుటుంబాలు బీజేపీలో చేరాయి. వారికి అభ్యర్థి ఆదినారాయణరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాన్ని ఆదుకోవాలి



వినతి పత్రం అందజేస్తున్న స్వర్ణభారత్ ప్రజాపార్టీ నాయకులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 3: జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో ఏవో వెంకటలక్షుమ్మకు స్వర్ణభారత్ ప్రజాపార్టీ, ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ సంఘం వారి ఆధ్వర్యంలో పలువురు చేనేత నాయకులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం గ్రామంలో భూమి కబ్జాకు గురైందని ఎన్నిసార్లు మండల అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో పాలా సుబ్బారావు భార్య, చిన్నకూతురు సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబానికి కబ్జాకు గురైన వారి ఆస్తిని ఇచ్చి ఆదుకోవాలని వారు వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో స్వర్ణభారత్ ప్రజాపార్టీ అధ్యక్షుడు శిలివేరు దశరథరామయ్య, మహిళా అధ్యక్షురాలు చింతలపల్లె సునీత, సభ్యులు ఎం.గాయత్రి, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శిలివేరు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు చింతపల్లె రుద్రమహేశ్వరుడు, కదిరి అసెంబ్లీ కన్వీనర్ ఎస్.గిరిధర్, ఆళ్లగడ్డ అసెంబ్లీ కన్వీనర్ కోడి సుధాకర్, కట్టా నరసింహులు ఎర్రం సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్లపాడు సర్పంచ్‌పై పోలీసులకు ట్రాన్స్‌కో ఏఈ ఫిర్యాదు

కాశినాయన ఏప్రిల్ 3: కోడిగుడ్లపాడు సర్పంచ్ సోమేసుల బాలగురయ్య విధులకు ఆటంకం కల్గించేవిధంగా తనను ఫోనులో నానాదుర్భాషలాడాడని నర్సాపురం ట్రాన్స్‌కో ఏఈ రమేష్‌బాబు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ,కోడిగుడ్లపాడు,కొండ్రాజుపల్లె గ్రామాల్లో తరచూ కరెంట్ బ్రేక్‌డౌన్‌లు వస్తున్నాయని వాటినివారణకోసం ఉదయం 10 గంటల సమయంలో లైన్‌కింద చెట్లు తొలగించుటకోసం ఎల్‌సీ తీసుకొని సిబ్బందితో పనిచేయిస్తున్నానన్నారు. మధ్యాహ్న సమయంలో ఫోన్‌చేసి తాను కోడిగుడ్లపాడు సర్పంచ్ బాలగురయ్యనని ఎవరిని అడిగి ఎల్‌సీ తీసినావు. కరెంట్ ఆపి పనిచేస్తే ఆవిషయం సర్పంచ్‌కు చెప్పాల్సిన బాధ్యత నీకులేదా అంటూ నానా బూతులు తిట్టాడన్నారు .ఈ విషయం పై అధికారులకు తెలియపరిచానని న్యాయంచేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశానని ఏఈ పేర్కొన్నారు. ఈవిషయంపై ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డిని వివరణ కోరగా సర్పంచ్‌పై ఏఈ రమేష్‌బాబు కంప్లైట్ ఇచ్చిన విషయం వాస్తవమేనని పిలిపించి విచారిస్తానన్నారు.

పెన్షన్‌దారులను ఇబ్బంది పెట్టిన సచివాలయ సిబ్బంది

మైదుకూరు, ఏప్రిల్ 3 :సామాజిక పించన్ల పంపిణీకి ప్రభుత్వం వద్ద డబ్బులు లేవు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ కొందరు వలంటీర్లు వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నారని ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు అందాయి. దీంతో ఎన్నికల ప్రచారంతో పాటు ఎన్నికల విధుల్లో వలంటీర్లు పాల్గొనరాదని, అలాగే పించన్ల పంపిణీ కూడా వారితో వద్దని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. కానీ చంద్రబాబు కారణంగానే పింఛన్లు ఇవ్వలేకపోయామని వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేశారు. వాస్తవంగా ప్రభుత్వం వద్ద డబ్బు లేకనే పింఛన్ల పంపిణీ ఆలస్యమైందని అందరూ తెలుసుకున్నారు. కాగా కొంత మంది సచివాలయ సిబ్బంది మైదుకూరులో పెన్షన్ దారులను ఇబ్బందులు పెట్టడమే లక్ష్యంగా పెన్షన్లు పంపిణీ చేశారు. బుధవారం నుంచి సచివాలయం వద్ద పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలుసుకున్న లబ్ధిదారులు ఉదయం 10 గంటల నుంచే సచివాలయాల వద్ద కాపు కాశారు. మధ్యాహ్నం నుంచి డబ్బులు వస్తాయని తెలిసినా వారికి చెప్పక పోవడంతో పడిగాపులు కాశారు. దీంతో లబ్ధిదారులు అగచాట్లు పడ్డారు. లబ్ధిదారులను ఇంకా ఇబ్బందులు పెడితే అధికార పార్టీకి సానుభూతి వస్తుందనే లబ్ధిదారులను తీవ్ర ఇబ్బందులు పెట్టారు.